ప్రజాశక్తి

శనివారం 19 నవంబర్ 2022 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



మహాసభలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, వేదికపై సైదులు, సీతారామిరెడ్డి, కళ్యాణ్, కుటుంబరావు తదితరులు

కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులు, రుణాలు

- కౌలు రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా 3వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్
- నూతన అధ్యక్ష కార్యదర్శులుగా గువ్వల సీతారామిరెడ్డి, చనుమోలు సైదులు

ప్రజాశక్తి - వీరులపాడు

కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులు, రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. ఎపి కౌలు రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా మూడో మహాసభ శుక్రవారం వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలోని వినయ్ కాన్వెంట్ ఆవరణలో జరిగింది. ఈ మహాసభకు సంఘం జిల్లా అధ్యక్షులు



చనుమోలు సైదులు, గువ్వల సీతారామిరెడ్డి,

జి.సీతారామిరెడ్డి, నాయకులు జి.ఏడుకొండలు అధ్యక్షవర్గంగా

(మిగతా 6లో)

గ్రామదర్శినికి సన్నద్ధం

- నేడు గ్రామాల సందర్శనకు అధికారులు పయనం
- తొలివిడతలో 1552 సమస్యల గుర్తింపు
- 1058 పరిష్కారం, పెండింగ్‌లో ఉన్నవి 498

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కార వేదికగా గ్రామదర్శిని కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. శనివారం రెండో విడత జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధమైంది. ఉదయం ఐదు గంటలలోపు జిల్లా అధికారుల ఫోన్‌కు వారు సందర్శించాల్సిన గ్రామానికి సంబంధించిన వివరాలను మెస్సేజ్ ద్వారా తెలియజేస్తారు. మొదటి విడత కార్యక్రమంలో గ్రామాల్లో గుర్తించిన సమస్యల్లో చాలావరకు నెలరోజుల్లోనే పరిష్కరించబడ్డాయి.

కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా రూపొంచిన గ్రామదర్శిని వెబ్‌సైట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్టు 25న కృష్ణాజిల్లా పెడనలో ప్రారంభించారు. మొదటి విడత కార్యక్రమాన్ని అక్టోబర్ 14 జిల్లాలోని 75 గ్రామాల్లో నిర్వహించారు. 75 మంది జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించారు. మొత్తం 14 విభాగాలకు సంబంధించి 1582 సమస్యలను గుర్తించారు. వీటిలో 1058 పరిష్కరించారు. తమ పరిధిలోలేని 26 సమస్యలను క్లోజ్ చేశారు. ఆర్థికపరమైన మరో 498 సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సంప్రదించి వీటిని పరిష్కరించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

పెండింగ్‌లో 498 సమస్యలు

జిల్లా విద్యాశాఖకు సంబంధించి స్కూల్ భవనాల



మొదటి విడత గ్రామదర్శినిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా (ఫైల్)

మరమ్మతులు, భోజన వసతులు, సమయపాలన తదితరాలపై 314 సమస్యలను గుర్తించారు. 120 సమస్యలను పరిష్కరించారు. మరో 187 గృహ నిర్మాణ సమస్యలు, జగనన్న కాలనీల్లో మౌలిక వసతులపైన 223 సమస్యలు గుర్తించగా, 83 పెండింగ్‌లో ఉన్నాయి. స్త్రీ శిశుసంక్షేమశాఖ (డిడబ్ల్యూసిడబ్ల్యూ) 99 సమస్యలు గుర్తించగా 62, డిఆర్‌డిఎ విభాగంలో మూడు, డ్వామా విభాగంలో నాలుగు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైర్లు మార్చడం తదితర విద్యుత్‌శాఖకు సంబంధించి 108 సమస్యలు గుర్తించగా, 68 పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో 96 సమస్యలు గుర్తించగా 89 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. గిరిజన సంక్షేమ శాఖలో ఒక సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. ఆర్థిక అవసరాలున్న సమస్యలు ఎక్కువగా అపరిష్కృతంగా ఉన్నట్లు జిల్లా యంత్రాంగం చెబుతోంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధులో చర్చించి ఈ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ప్రాణాలు తీసిన టిప్పర్


ఇద్దరు ముఠా కార్మికులు దుర్మరణం

ప్రజాశక్తి - భవానీపురం

టిప్పర్ ఢీకొని ఇద్దరు ముఠా కార్మికులు దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి సుమారు 2.30 గంటల ప్రాంతంలో విజయవాడ సమీపంలోని గొల్లపూడిలోని మహాత్మా గాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ముఠా పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గొల్లపూడి కమర్షియల్ కాంప్లెక్స్‌లోని గరుడ ట్రాన్స్‌ఫోర్ట్‌లో జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన మొకర నీలకంఠం (52), ఊర్మిళానగర్‌కు చెందిన ఆవుల వెంకటేశ్వర్లు (41) ముఠా పనిచేస్తున్నారు. ముఠా పని ముగించుకుని శుక్రవారం అర్ధరాత్రి 2.20 గంటలకు ద్విచక్ర వాహనం (యాక్టివా)పై ఇంటికి వెళుతుండగా, సితార సెంటర్ వైపు నుండి గొల్లపూడి వైపుకు అతి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నీలకంఠం అక్కడికక్కడే మరణించగా, వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. సంఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటేశ్వర్లుగా భార్య, ఇద్దరు కుమారులు, నీలకంఠంకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. తోటి ముఠా కార్మికుడు తమ్మా మోజస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

టిడిపి నాయకులు దూది బ్రహ్మయ్య నివాళి

రోడ్డు ప్రమాదంలో మరణించిన ఊర్మిళానగర్‌కి చెందిన టిడిపి కార్యకర్త ఆవుల వెంకటేశ్వర్లు మృతదేహాన్ని టిడిపి 43వ డివిజన్ అధ్యక్షులు దూది బ్రహ్మయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. సితార రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆ రోడ్డులో డివైడర్లు నిర్మించాలని గతంలో తాము విఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా డివైడర్లు నిర్మించాలని కోరారు.



ఆవుల వెంకటేశ్వర్లు మృతదేహం, అంతర్‌చిత్రంలో పాత ఫొటో



మొకర నీలకంటం మృతదేహం, అంతర్‌చిత్రంలో పాత ఫొటో



దాళ్వాకు నీరివ్వాలని మంత్రి జోగి రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, నాయకులు పి.నరసింహారావు, ఎస్.మనోహర్ శ్రీ ఉదయ్, జనార్ధన్ తదితరులు

దాళ్వాకు నీరివ్వండి

మంత్రి జోగి రమేష్‌కు రైతు సంఘం నేతల వినతి

ప్రజాశక్తి - బంటుమిల్లి

బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులకు దాళ్వా సాగుకు నీరివ్వాలని కోరుతూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్‌కు శుక్రవారం రైతు సంఘం నేతలు వినతిపత్రం సమర్పించారు. బంటుమిల్లి, కత్తివెన్ను మండలాలు డెల్టా ప్రాంతంలో ఉండడం, సముద్ర తీరం కావడంతో వరి సాగు తప్ప వేరే పంటలు పండే అవకాశం లేదని పేర్కొన్నారు. ఉప్పు పండిపోయి సార్వా సాగుకు సారవంతం లేక పంటలు పండటం లేదని వివరించారు. అందువల్ల దాళ్వా సాగుకు నీరివ్వాలని కోరారు. అలాగే 2020 ఏప్రిల్‌లో

(మిగతా 6లో)

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-కంచికచర్ల : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ కోట్లాది రూపాయల ఖర్చు చేస్తోందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద కృష్ణానది ఒడ్డున గల తాగునీటి సరఫరా పంపింగ్ స్కీం వద్ద ఫిల్టర్ బెడ్ మరమ్మతులు, రాక్ శాండ్, గుంటూరు జిల్లా అమరావతి వైపు గల పాయ నుండి చెవిటికల్లు వరకు నదిలో నీటిపాయ మళ్ళించే సప్లయ్ ఛానల్ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామీణ నీటి సరఫరా పథకం నిధులు 10 లక్షల రూపాయలతో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణానది నీటిని మోటార్లు ద్వారా సంప్ లోకి నింపి, సంప్లోనీటిని శుద్ధి చేసి కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని పలు గ్రామాలకు పంపిణీ చేస్తున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా నీటిని మళ్ళించే పనులు చేపట్టామన్నారు. ఈ



కార్యక్రమంలో జడ్‌పిటిసి వేల్పుల ప్రశాంతి, చెవిటికల్లు, కునికినపాడు సర్పంచ్ లు బుడ్డి విజయలక్ష్మి, బండారుపల్లి సత్యం, మాజీ ఎంపిపి పాటిబండ్ల హరి, వైస్ ఎంపిపి వెలగలేటి మాధవి పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్‌లో 14 సచివాలయాల అడ్మిన్సు, ఏఎన్ఎం లతో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను శుక్రవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ స్థానిక శ్రీ గెంటేలా శకుంతలమ్మ కళాశాల ఆవరణలో ఈనెల 20వ తేదీ ఉదయం 9 గంటలకు చిట్యాలకు చెందిన మారెళ్ళ అమ్మిరెడ్డి, పుల్లారెడ్డి ట్రస్ట్ వారి ఆర్థిక సహకారంతో, శ్రీ శంకర నేత్రాలయం ఆసుపత్రి గుంటూరు వైద్య బందంచే ఉచిత వైద్య కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు ఉన్న తమ వార్డుల్లో కంటి వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి ఈ వైద్య శిబిరానికి వచ్చే విధంగా వారికి సమాచారాన్ని అందించాలని సూచించారు. అనంతరం కంటి పరీక్షల్లో నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు గుంటూరు శంకర నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్,నాయకులు ఎస్‌ఎస్పి సైదా, మన్నే అప్పారావు పాల్గొన్నారు. ప్రజాశక్తి-నందిగామ : ఈనెల 20వ తేదీన నందిగామ కె.వి.ఆర్ కాలేజ్ నందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఘంటా జ్వాలా నరసింహారావు లీవ్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, రక్తనాళాలు, బ్లడ్ ప్రెజర్, ఎముకలు, కీళ్ల నొప్పులు వ్యాధులకు సంబంధించి ఉచితంగా చూస్తారన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలోని 12వ వార్డు పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదల జీవితాలలో వెలుగులు నిండుతున్నాయని అన్నారు. వాలంటీర్ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి ఇళ్ల ముంగిటనే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం ,ఏఈ ఫణి శ్రీనివాస్ ,ఇన్చార్జి కోమటి రవికుమార్ , పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి , మహమ్మద్ మస్తాన్ ,కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-జగ్గయ్యపేట : జగ్గయ్యపేటలో13వ సచివాలయం 29వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఏ పథకం కావాలన్నా టిడిపి నాయకులు చుట్టూ తిరుగుతూ ముడుపులు చెల్లించుకోవలసి వచ్చేదని తెలిపారు. నేడు జగనన్న పాలనలో వాలంటీర్ల ద్వారా నేరుగా ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బద్దు నాయక్, ముస్లిం మైనారిటీ అధ్యక్షులు షేక్ మొహిద్దిన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడిసె పరంధామ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - తిరువూరు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ విద్యార్థి ఎంపికైనట్లు తిరువూరు విజన్ స్కూల్ ప్రధానోపాధ్యా యులు సోమేశ్వరావు తెలిపారు. ఈనెల16న గుడి వాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఉమ్మడి క ష్ణా జిల్లా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయని, 8వ తరగతికి చెందిన సిహెచ్. గోపీచంద్ అండర్ 14 కబడ్డీ పోటీలో పాల్గొని రాష్ట్ర జట్టుకు ఎంపి కైనట్లు తెలిపారు. గోపిచంద్ ను, శిక్షణ ఇచ్చిన పిఇటి టి. వసంత్ ను ప్రదానో పాధ్యయులతో పాటు ఎట రమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాలలో శుక్రవారం అభినందించారు.

ఉత్సాహంగా చెకుముకి సంబరాలు



తిరువూరులో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరువూరు : విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని చిన్నతనం నుండే అలవాటు చేసుకోవాలని, ప్రయోగపూర్వకంగా నిరూపించిన అ శాలనే నమ్మాలని, కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపా ల్ రెబ్బ మురళీకృష్ణ తెలిపారు. జన విజ్ఞానవేదిక(జెవివి) తిరువూరు శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం జరిగిన మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో ముఖ్య అతిథిగా ప్రిన్సి పాల్ పాల్గొన్నారు. మొత్తం 15 పాఠశా లల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల నుం డి రెండు, ప్రయివేటు పాఠశాలల నుం డి రెండు టీములు చొప్పున జిల్లా స్థా యికి పోటీలకు ఎంపికైనట్లు జెవివి శా ఖఅధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కడిమి పాపారావు, డి.సుదర్శన్ చెప్పారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో చెకుముకి రాష్ట్ర కన్వీనర్ ఎమ్.హరి కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు పి.వి.శర త్ బాబు, సుభాని, శోభన్ బాబు, తిరు వూరు సమత కన్వీనర్ ఉషారాణి వివి ధ పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలు వీరే

ప్రజాశక్తి-గంపలగూడెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్ లో శ్రీ గాయత్రి విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం, శ్రీ సరస్వతి విద్యాలయానికి చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు గంపలగూడెం మండల జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పోతురాజు కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. గాయత్రి విద్యాలయం నుండి కె ప్రదీప్, ఏ వెంకటమణి , పి సొహెల్ ఖాన్ లు ప్రథమ స్థానం లో నిలవగా, శ్రీ సరస్వతి విద్యాలయం నుండి కె యశ్వంత్, బి జయశ్రీ, బి జయంతులు ద్వితీయ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. మండలం నుండి 13 పాఠశాల నుండి ముగ్గురు జట్టుగా 39 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కృష్ణయ్య వివరించారు. విజేతలకు గంపలగూడెం ఉన్నత పాఠశాల హెచ్ఎం సంగెపు జమలయ్య ప్రోత్సాహకాలను అందజేయగా, జెవివి నాయకులు శేషగిరి పాల్గొన్నారు

చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి- రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రం లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో ఏడు ప్రభుత్వ పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో రంగాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల మొదటి స్థానంలో మద్దులపర్వకు చెందిన మోడల్ స్కూలు విద్యార్థులు రెండ స్థానంలో నిలబగా ప్రైవేటు విభాగంలో నారాయణ హై స్కూల్ మొదటి స్థానం, గీతాంజలి హై స్కూల్ రెండవ స్థానంలో నిలిచాయి. పై నాలుగు టీములు డిసెంబర్ 10, 11 తారీఖులలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించేయని జన విజ్ఞాన వేదిక ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ పట్ల, పర్యావరణ పరిరక్షణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దామోదర్ రెడ్డి, గీతాంజలి గీతాంజలి హైస్కూల్ డైరెక్టర్ కోటిరెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎపిఎన్‌జిఒ నందిగామ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-నందిగామ : ఎపియన్జిఓస్ అసోసియేషన్ నందిగామ తాలూకా యూనిట్ లో ఎలక్షన్ నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం జరిగింది. ఒక్క ప్యానల్ నుండి మాత్రమే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ వేసిన ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఎలక్షన్ అధికారులు జిల్లేపల్లి స్వామి , కె.సంపత్ కుమార్ లు ప్రకటించారు. ఎపియన్జిఓస్ నందిగామ తాలూకా యూనిట్ అధ్యక్షులుగా యం. శ్యామ్ బాబు, కార్యదర్శి గా షేక్ భాషు, కోశాధికారి గా వి.యలమందయ్య, సహ అధ్యక్షుడుగా వై వీరపాల్, ఉపాధ్యక్షులు గా షేక్ . అబ్దుల్ షరీఫ్, ఎమ్. సాయిరామ్ డి.జనార్ధన్, కార్యదర్శులుగా ఎ. పుల్లి, ఎ. సివలాల్, జె.గంగరాజు మహిళా సహాయ కార్యదర్శిగా షేక్ ఇష్రత్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నుతనంగా ఎన్నికైన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ యూనిట్ పరిధిలోని ఉద్యోగులకు సంబంధించిన ఏ అంశాన్ని అయిన ఈ నాయకత్వం దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉందాలని అసోసియేషన్ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి. శివారెడ్డి ఏమ్.భిక్షాలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'జలకళ' రైతులకు వరం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-నందిగామ : జలకళ పథకం పై రైతులకు అవగాహన కల్పించాలని నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహనరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నందిగామ పట్టణంలోని శాసనసభ్యుల వారి కార్యాలయంలో వైయస్సార్ జలకళ పథకం పై అధికారులు, నాలుగు మండలాల ఎంపీపీలు- జడ్పిటిసి లతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఆదేవిధంగా జలకళ పథకం ద్వారా ఇప్పటివరకు నాలుగు మండలాల్లో ఎన్ని బోర్లు వేశారని, వాటి పనితీరు గ్రామాల్లోని రైతులకు ఇంకెన్ని బోర్లు అవసరమవుతాయో అనే విషయంపై నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

నెమలి వేణుగోపాల స్వామికి రూ.50 వేలు వితరణ

ప్రజాశక్తి - గంపలగూడెం : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి శ్రీ వేణుగోపాల స్వామి వారికి 50 వేల రూపాయలు వితరణగా ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా వైరాకు చెందిన చెరుకుపల్లి సీతయ్య, శైలజ దంపతులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో చెక్కు ద్వారా నగదు అందజేసినట్లు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుచున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన తిరుపతి గౌరి వెంకట నాగ సురేష్, అనూష లు రూ.10116/- లు విరాళాన్ని దేవాలయ అధికారులకు అందజేశారు. దాతలకు స్వామి వారి ప్రసాదములు, శేషవస్త్రములు అందించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పసుపులేటి రాధా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ సహాయకమిషనర్, కార్యనిర్వహణాధికారి డి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు రాష్ట్ర స్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సి హెచ్ దామోదర్ రెడ్డి తెలిపారు. ఈనెల 16వ తేదీన గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఎస్ జి ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీలలో అండర్ - 17 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని కే. నిర్మల అండర్ - 14 విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి పి. రవితేజ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు భాస్కరరావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫ్లెక్సీలు తొలగించకుంటే ఆందోళన : టిడిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలో ఉన్న అన్ని ఫ్లెక్సీ లను తొలగించకుంటే ఈనెల 19 వ తేదీ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలుగుదేశం కౌన్సిలర్లు హెచ్చరించారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, పదో వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, సామినేని మనోహర్, పేరం సైదేశ్వ రరావు, ఇర్రి నరసింహారావు, నకిరి కంటి వెంకట్ తదితరులు మున్సి పల్ కార్యాలయంలో శుక్రవారం మేనేజర్ ని కలిసి వినతి పత్రం, నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాదుడే బాదుడు కార్యక్రమం సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలగించడంపై అభ్యంతరం తెలిపారు.

ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా చర్యలు

- కృష్ణాజిల్లా పరిశీలకులు ఎం.వి. శేషగిరిబాబు



మాట్లాడుతున్న ఎం.వి. శేషగిరిబాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు సమగ్రంగా పరిశీలన చేసి సక్రమైనమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ ఎం.వి. శేషగిరిబాబు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ రోల్ అబ్జర్వర్ జిల్లా కలెక్టర్, ఇఆర్వోలు, ఎఇఆర్వోలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు, సలహాలు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూలు ప్రకారం సక్రమంగా నిర్వహించుటకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అన్నారు. ఇందుకోసం బిఎల్వోలకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు మార్పులు, చేర్పులకు. సంబంధించి ఫారం 6,7,8 సరిపడు సంఖ్యలో బిఎల్వోల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఒక పార్లమెంటు నియోజక వర్గం ఏడు శాసన సభ నియోజక వర్గాలు ఉన్నాయని షెడ్యూలు ప్రకారం స్పెషల్ సమ్మరీ డివిజన్ నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే నెల 9వ తేది వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. స్వీప్ యాక్టివిటీస్ లో భాగంగా ప్రతి శని, ఆది వారాల్లో స్పెషల్ క్యాంపైన్ నిర్వహించాలని ఇఆర్వోలకు సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితాలపై తమ అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఈ సమావేశంలో తెలియజేశారు. సిపిఎం నాయకులు కొడాలి శర్మ ఓటరు జాబితాలో కులాల పేరుతో వీధులు పేర్కొనడం పట్ల అభ్యంతరం తెలియజేశారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. బిఎస్పి పార్టీ ప్రతినిధి పెద్ది ప్రసాదరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కోక ఫణిభూషణ్, వైయస్ఆర్ సిపి పార్టీ ప్రతినిధి షేక్ సిలార్ దాదా. టిడిపి ప్రతినిధి వెంకట కాంతారావు, టిడిపికి చెందిన మరో ప్రతినిధి బత్తిన దాసు, బిజెపి ప్రతినిధి పంతం గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై మంత్రి బొత్స వ్యాఖ్యలకు యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను యుటిఎఫ్ కృష్ణా జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బి.కనకరావు, జే లెనిన్ బాబులు తెలిపారు. ఉద్యోగులంతా ప్రజల్లో భాగమేననీ, వారి సంక్షేమం కూడా ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలేమీ కోరటం లేదన్నారు. గతంలో అమలు చేసిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మాత్రమే కోరుతున్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీత భత్యాలు పొందడం ఉద్యోగుల హక్కుగా గుర్తు చేశారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఏపీజి ఎల్ఐ సొమ్ములు అవసరాల నిమిత్తం వాడుకోవడానికి దరఖాస్తు చేస్తే ప్రభుత్వం చెల్లింపుల్లో జాప్యం చేయడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పిఎఫ్, ఏపీజిఎల్ఐ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ఆర్థికపరమైన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరడం న్యాయమే కదా అని వారు ప్రశ్నించారు. ఉద్యోగులు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు గత ఒప్పందాలు ప్రకారం వారికి రావాల్సిన హక్కులు డిఏలు, ఉద్యోగోన్నతులు, బదిలీలు, వేతన సవరణలు కోరుతున్నారన్నారు. కొత్త సౌకర్యాలు కోరడం లేదన్నారు. సుదీర్ఘ పోరాటం ఫలితంగా సాధించుకుని పొందుతున్న హక్కులను కొనసాగించమని కోరడం తప్పా అని ప్రశ్నించారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరిస్తామనీ, ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో డిఏలు చెల్లిస్తామని, ఉద్యోగ నియామకాలు చేపడతామని,మెరుగైన పిఆర్సిని అమలు చేస్తామని మాట తప్పం మడం తిప్పం అని ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే తాము కోరుతున్నామన్నారు.

పాత వస్తువులకు వేలం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలోని బాలుర గురుకుల పాఠశాలలో పాత వస్తువులకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో జిల్లా నలుమూల నుంచి 115 మంది ఒక్కొక్కరు రూ.10వేలు చొప్పున డిపాజిట్లు కట్టి పాటలో పాల్గొన్నారు. అధిక మొత్తంలో వేలం పాడిన వారు రూ.4.54 లక్షలకు పాడుకుని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ టి పి కుమార్, ఎంఈఓ ఎన్.శివశంకరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ భార్గవ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ధర్నా



వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)

మచిలీపట్నం బైపాస్ రోడ్‌లో ఉన్న ఎస్ఆర్ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కృష్ణాజిల్లా కార్యదర్శి పి. పవన్ కుమార్ డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు కోరుతూ శుక్రవారం కలెక్టరెట్ ధర్నా చౌక్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో సుమారు 70 మంది విద్యార్థులు 8, 9,10 తరగతి చదువుతున్నారన్నారు. అధికారులు, యాజమాన్యాల మధ్య ఉన్న సంబంధాల వల్లే ప్రైవేట్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా గత సంవత్సరం నుండి విద్యార్థులను అడ్మిషన్ చేర్పించుకొని తరగతులు నిర్వహిస్తురన్నారు. దీని కారణంగా అర్హత ఉండి కూడా ఈ విద్యార్థులు అమ్మ ఒడి నష్టపోయారన్నారు. ప్రతి సంవత్సరం గుర్తింపు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధికారులకు విన్నవిస్తున్నప్పటికీ పట్టించు కోవటం లేదన్నారు. అధికారులు పాఠశాలలను పర్యవేక్షణ చేయడం లేదన్నారు. తల్లిదండ్రులను విద్యార్థులను మోసం చేసి అడ్మిషన్లు నిర్వహించుకున్న ఎస్ఆర్ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు నుండి వసూలు చేసిన ఫీజులను తిరిగి చెల్లించాలని, విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా వారికి కోరుకున్న పాఠశాలలో అడ్మిషన్లు కేటాయించాలని, వారి ఫీజులను యాజమాన్యమే బరాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషకు అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సమరం, నాయకులు అక్షయ్ కుమార్, కీర్తి, సలీం, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

- మంత్రి జోగి రమేష్



ప్రజాశక్తి-బంటుమిల్లి : రానున్న 25 సంవత్సరాల వరకు జగనే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. బంటుమిల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం మంత్రి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మొదటిగా బంటుమిల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల కల్పనకు మనబడి నాడు-నేడు 2వ దశ కార్యక్రమం కింద రూ.59.04 లక్షల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని రామన్నమోడీ గ్రామంలో రూ.7 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం, ములపర్రు గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగనవాడీ భవనాలను మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడారు. రామన్నమోడీ గ్రామంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కులమత రాజకీయాలు చూడకుండా ప్రజలందరూ నా వాళ్లేనన్న రీతిలో సమానంగా చూస్తూ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల జెడ్పీటీసీలు మలిసెట్టి వెంకట రమణ, మైలా రత్నకుమారి, బంటుమిల్లి ఎంపిపి వెలివెల చినబాబు, కత్తివెన్ను ఎంపీపీ కూనసాని తాతాజీ వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారిబాబు, కుత్తివెన్ను మండల బ్యాంక్ ప్రెసిడెంట్ లక్ష్మోజి ఏఎంసీ చైర్మన్ పి. బాబురావు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కోడూరు

కంటి వైద్య చికిత్సలో అపార అనుభవం కలిగిన సాయి దుర్గ ఐ క్లినిక్ అండ్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామ సచివాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.వి.ఎస్.ఎస్.ఈ రావ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకమంది కంటి పరీక్షలు చేయించుకునే ఆర్థిక సోమత లేక ఇబ్బందులు పడుతు న్నారని ఉల్లిపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ వెర్రి పావని తమ దృష్టికి తీసుకురావడంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్నవారికి ఐఒఎల్ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించి మందులు కూడా ఉచితంగా అందిస్తామని తెలిపారు.

పివిపి సిద్ధార్థ లెక్చరర్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి-పెనమలూరు

పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలోని ఇంగ్లీష్ విభాగంలో పనిచేస్తున్న మాలెంపాటి రుద్రమదేవికి ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. శివాజి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 'భారతీయ రచనలు - ఫెమినిజం' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పి. లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ వి. నాగభూషణరావు, అధాపకుడు ఎమ్. సురేష్ కుమార్‌లు రుద్రమదేవిని అభినందించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి సహకరించాలని బాపులపాడు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ జొన్నలగడ్డ భవాని తెలిపారు. శుక్రవారం బాపులపాడు మండలం వేలేరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భవానీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె భవాని మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చే దాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎర్రగొర్ల నాగేష్, జెడ్ పి టి సి కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ ఎస్ సుందమ్మ, నక్కా గాంధీ, అవిర్నేని శేషగిరిరావు, ఎంపీటీసీ మురుదొడ్డి యోహాన్, షేక్ తనీషా, ఏసుబాబు, రాకడ రాజు, బి వెంకటేశ్వరరావు,రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం చినయాదర గ్రామానికి చెందిన పులిగడ్డ శ్రీనివాసరావు గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. శుక్రవారం ఆ కుటుంబాన్ని జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ పరామర్శించి స్థానిక జనసేన నాయకుడు ముళ్ళపూడి సుబ్బారావు ఆధ్వర్యంలో జనసైనికులు సమీకరించిన 15 వేల రూపాయల నగదు, తన వంతుగా 10 వేల రూపాయల నగదును కలిపి మొత్తం 25 వేల రూపాయల నగదును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు, వంపు గడవలచౌదరి, వీరాంజనేయులు, కుమారస్వామి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి పెదపారుపూడి : మండల కేంద్రమైన పెదపారుపూడి నాలుగు రోడ్ల కూడలి సెంటర్‌లో హిమాలయ వాటర్ ప్లాంట్‌ను పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పెదపారుపూడి ఎస్సై పి .నాగ కళ్యాణి శుక్రవారం వాటర్ ట్యాప్‌కు రిబ్బన్ కట్ చేసి ట్యాబ్‌ను ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ మూల్పూరి హరీష, ఎంపీటీసీ వేమూరి మోహన్, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం : జెసి

ప్రజాశక్తి-విజయవాడ: జిల్లాలో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ అన్నారు. జిల్లాలో చేపట్టిన సాధారణ జాతీయ రహదారి భూ సేకరణ పనులు పని తీరుపై శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నందు జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గొల్లపూడి రైల్వే లైన్ సంబంధించి ప్లానింగ్ నోటిఫికేషన్ సకాలంలో పంపాలని సబ్ కలెక్టర అదితి సింగ్‌ను ఆదేశించారు. జక్కపూడి ఫ్లైఓవర్ పనులలో భాగంగా 93 సెంట్ల భూమికి అవార్డు పాస్ అయిందని మిగిలిన 87 సెంట్ల భూమికి సంబంధించి జాయింట్ ఇన్‌స్పెషన్ రిపోర్టును పంపాలని సబ్ కలెక్టర్‌కు సూచించారు. జి.కొండూరు మండలం చెరువుమాధవవరం, తెల్లకీసరపాడు, గంగినేనిపాలెం, దుగిరాలపాడు రైల్వే పాజెక్టులో అవార్డు పాస్ అయిందని తదుపరి చర్యలపై రికార్డుల్లో చూపాలన్నారు. గుణదల, విజయవాడ నార్త్ రైల్వే రెండవ లైన్ భూ సేకరణలో సబ్ కలెక్టర్ రిమార్కుల నివెదికను అందజేయలన్నారు. జగ్గయ్యపేట ముక్తేశ్వరపురంలో ఇన్‌లాండ్ వాటర్ వేవ్ సంబంధించి 7.50 ఎకరాలకు అవార్డ్‌కు అమోదం ఇచ్చారని సంబంధిత నివేదికను పంపాలని అన్నారు. భవానిపురం ఎ-1 సర్వీస్ రోడ్డులో ఆర్‌అండ్‌ఆర్ స్కీమ్ ప్రతిపాదనలు వచ్చిన నివేదికను సర్క్యులేట్ చేయాలన్నారు. మైలవరం మండలం చంద్రాల ఆర్‌అండ్‌బి రోడ్డు అవార్డు పాస్ అనుమతుల కొరకు పంపాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నందిగామ ఆర్‌డివో ఏ రవీంద్రరావు, తిరువూరు ఆర్‌డివో వైవి లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కొండపల్లి ఖిల్లా సందర్శన

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల హైస్కూల్ స్కౌటు విద్యార్థులు శుక్రవారం కొండపల్లి ఖిల్లాకు హైక్ కు వెళ్ళారు. ప్రధానోపాధ్యాయులు శాఖమూరి శ్రీనివాస ప్రసాద్ హైక్ ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కౌటు ఉపాధ్యాయుడు దారం ప్రసాద్ మాట్లాడుతూ హైక్ నిర్వహణ వల్ల విద్యార్థుల్లో శారీరక దఢత్వం, స్థానిక కళా సంస్కతులపై అవగాహన, తోటి స్నేహితులతో సౌభ్రాతత్వం, చారిత్రక విషయాలపై సమగ్ర అవగాహన కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్లు కొండపల్లి ఖిల్లాను ఎక్కి అందలి దర్బారు హాలు, మార్కెట్ యార్డు, రాణీమహల్, కారాగారం, ఆయుధాగారం మొదలైన ఆనాటి కట్టడాలను సందర్శించారు. కోటను పరిపాలించిన రాజుల గురించి తెలుసుకున్నారు. కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రాన్ని సందర్శించి బొమ్మల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. ఇబ్రహీంపట్నం లోని గోదావరి, కష్ణానదుల సంగమ ప్రదేశాన్ని చూశారు. కార్యక్రమంలో బాజీ, నన్నేసాహెబ్, మీరాసాహెబ్, అభిరాం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని నందిగామ మండల విద్యాశాఖ అదికారి బాలాజీ ఆదేశించారు. శుక్రవారం నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న బోజనంను ఎంఇఓ బాలాజి పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలని కోరారు. విద్యార్థుల అటెండెన్స్ పరిశీలించారు.

రోడ్లపై పశువులను వదలొద్దు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని రోడ్లపై రాత్రి సమయంలో గోవులను విచ్చలవిడిగా వదిలేస్తున్నారని, వాటిని అలానే వదిలేస్తే గోసాలకు తరలిస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం పట్టణంలోని గల బందెలదొడ్డిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ నెలరోజుల క్రితం మైకు ద్వారా ప్రజలకు తెలియజేయడం జరిగిందని, ఇప్పటికీ కూడా ఆవుల యజమానులు రోడ్లపై యదేచ్ఛగా వదిలేయడంతో జనాలకు ఇబ్బంది కలగడమే కాకుండా, గోవులకు కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, డి ఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలను ప్రైవేటీకరించొద్దు

నందిగామ తహశీల్దార్‌కు డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ వినతి



వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మైదానాలను, ఇండోర్ స్టేడియాలను, క్రీడా వికాస కేంద్రాలను ప్రైవేటు వారికి లీజుకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డివైఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నందిగామ తహశీల్దార్ నరసింహారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ క్రీడ మైదానాలను, ఇండోర్ స్టేడియంలను, స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంటర్లను పే అండ్ ప్లే పేరుతో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు లీజుకిస్తే క్రీడాకారులపై భారం పడుతుందన్నారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించి ఉచిత శిక్షణ ఇవ్వాల్సిన ప్రభుత్వం ఆట స్థలాలను లీజుకు ఇవ్వడం దారుణమన్నారు. పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని, క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించాలని, ప్రతి ఆటకు కోచ్‌లను నియమించాలని గతంలో శాప్ చైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చినా క్రీడా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. క్రీడారంగ సమస్యలను శాప్ అధికారులు వినే పరిస్థితుల్లో లేరని, ప్రభుత్వ పాలసీ అని చెప్పి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు నిధులు కేటాయించాలని, పే టు ప్లే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రవి, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఫోరమ్‌కు 15 దరఖాస్తులు



ఓపెన్ పోరమ్ నిర్వహిస్తున్న సర్కిల్-2 ఎసిపి బాలాజీ

ప్రజాశక్తి-విజయవాడ: ప్రతి శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే ఓపెన్ ఫోరమ్ మేళాలో పలు దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించినట్లు మూడు సర్కిల్స్ పరిధిలోని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తెలిపారు. మూడు జోనల్ కార్యాలయాల్లో శుక్రవారం జరిగిన ఓపెన్ ఫోరమ్‌లో 15 దరఖాస్తులొచ్చినట్లు వారు తెలిపారు. బిల్డింగ్‌నిర్మాణాల అనుమతులపై సంబంధిత ఓనర్లకు కలిగే సందేహాలను నివృత్తి చేశామన్నారు. ప్రతిఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పట్టణప్రణాళికా విభాగంలోని క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో బిల్డింగ్ నిర్మాణాల అనుమతుల్లో ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా జాగ్రత్తగా ప్లాన్స్ మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్స్ బాలాజి, జుబేన్ పాల్గొన్నారు.



ఇళ్ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలి : విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ

సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో చాలా కాలం నుండి నివాసం వుంటున్న నిర్వాసితుల నివాసాలను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్‌తో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకపరిధిలోఉన్న కాకాని నగర్, దేవినేని గాంధీపురం, మధురానగర్ ఇందిరా కాలనీ, నేతాజీ రోడ్డు ప్రాంతాలలో నివాసం వుంటున్న వారి ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు తగిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు సమర్పించాలని కోరారు. వీలైనంత త్వరలో ఆ ప్రతిపాదనలకు ఆమెదం తెలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. వలస వచ్చి వాంబే కాలనీలో నివాసం వుంటున్న కొండ దొరలకు వారి మైగ్రేషన్ రుజువు ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. సాగు, త్రాగు నీటి అవసరాలకు రూ.50 లక్షల నిధులతో పోలవరం కాలువ నుండి కంఢ్రిక చెరువుకు నీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

మలుపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయరూ..!

ప్రజాశక్తి-వత్సవాయి: ఇందుగపల్లి గ్రామం మూలమలుపు వద్ద మందస్తు ప్రమాదపు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల దేవాలయం ఎదురుగా ఉన్న మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు ప్రక్కనే మార్జిన్ కూడా లేకపోవడంతో ఆదమరిస్తే డ్రైనేజీ గుంతలో పడి వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. గోపినేనిపాలెం-చిన్న మోదుగుపల్లి, వత్సవాయి-వేములనర్వ, కంభంపాడు-తాళ్లూరు, కాకరవాయి-మాచినేనిపాలెం వెళ్లాలంటే ఎక్కువగా మూలమలుపులున్నాయి. పలు గ్రామాల్లో రోడ్ల పక్కన కనీస మార్జిన్ కూడా లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ రహదారిపై కొన్నిచోట్ల సూచిక బోర్డులు ఉన్నప్పటికి మరికొన్ని చోట్ల లేకపోవడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. మండలంలోని ప్రధాన రోడ్లతో పాటు



గ్రామాలను కలిపే రోడ్లు వద్ద కూడా సూచిక బోర్డులు లేకపోవడంతో కొత్త ప్రయాణికులను ప్రమాదాలు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రాలుగా అటవీ ప్రాంతాల అభివృద్ధి

విజయవాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి



ప్రజాశక్తి-విజయవాడ: మూలపాడు గ్రామ పరిధిలోని బటర్‌ఫ్లై పార్కును, కొత్తూరు-తాడేపల్లి (పోలవరం కెనాల్ ఏరియాలో) అటవీ ప్రాంతాన్ని టూరిస్ట్ కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రణాళికలను తయారు చేస్తున్నట్లు విజయవాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఒ) కె శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. వీకెండ్ వచ్చిందంటే మధ్యతరగతి ప్రజలు, దిగువ మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, ఆయా తరగతుల ప్రజలు ఎక్కడికెళ్లాలనే ప్రశ్న ఉత్పన్నమవుతుందన్నారు. పిల్లలు, పెద్దలు, కుటుంబ సభ్యులతో, తోటి మిత్రులతో రోజంతా హాయిగా గడపడానికి విజయవాడ నగరంలో అనువైన ప్రదేశం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ ఇబ్బందుల నుంచి కొంత వరకు ప్రజలకు ఉపశమనం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఫారెస్ట్ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ పలు రూపాల్లో అన్వేషిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే...విజయవాడ సమీప మూలపాడు, కొత్తూరు -తాడేపల్లి రెండు గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంతో పాటు కొంత కొండ ఏరియా కూడా ఉన్నందున అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతాలను నెల క్రితం విజిట్ చేసిన ప్రిన్సిపల్ ఛీఫ్ కన్స్‌ర్వేటర్ మధుసూదనరెడ్డి, అలాగే ఇటీవల ఈ ప్రాంతాలను పరిశీలించిన ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు బ్లూ ప్రింట్‌ను తయారు చేస్తున్నట్లు ఆర్ఎఫ్ఒ వివరించారు. పెద్దలు దగ్గర నుంచి పిల్లల వరకు ఈ అటవీ ప్రాంతాలకు వెళ్లి... ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించడంతో పాటు హ్యాపీగా గడపడానికి ఫెసిలిటీస్ కల్పించడం జరుగుతుందన్నారు. ఒక రకంగా మంచి టూరిస్ట్ ప్లేస్‌గా ప్రాచుర్యం పొందిన "మారేడుమిల్లి" టైపులో మూలపాడు, కొత్తూరు-తాడేపల్లి ఏరియా అటవీ ప్రాంతాలను వీకెండ్స్‌లో విజిటింగ్ ప్లేస్‌గా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ట్రెకింగ్, వాష్ రూమ్స్, మంచినీటి సదుపాయం, చిల్డ్రన్స్ ప్లే ఐటమ్స్ మూలపాడు బటర్‌ఫ్లై పార్కులో అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కార్తీక మాసంలో సాంప్రదాయంగా వస్తున్న వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడానికి, మూలపాడుకు పది కిలోమీటర్ల దూరంలో ఆంజనేయస్వామి, దొంగమర్ల బావి వంటివి ఉన్నాయని, ఇక్కడ ప్రజలు పూజలు చేసుకోవచ్చునని అన్నారు. పిల్లలకు అన్ని రకాల ప్లే ఐటమ్స్ (ఆటల పరికరాలు) ఏర్పాటు చేసి, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం, చిన్నలు, పెద్దల కోసం వీటిని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. విజయవాడకు అందుబాటులో ఉన్న మూలపాడు అటవీ ప్రాంతంలో సుమారు 100 హెక్టార్ల పరిధిలో బటర్‌ఫ్లై పార్కు, ఇతర అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి పరచాల్సి ఉందన్నారు. అలాగే కొత్తూరు-తాడేపల్లి ఏరియాలో కూడా 50 హెక్టార్ల పరిధిలో అభివృద్ధి పరచాల్సి ఉందన్నారు. వాకింగ్ ట్రాక్, యోగాకు అనువైనదిగా, ఫ్లాట్‌ఫామ్, ట్రెకింగ్, ప్లాంటేషన్ , చిల్డ్రన్స్ ప్లే ఐటమ్స్ వీటన్నింటినీ అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. వీటన్నింటికీ కోట్లాది రూపాయలు ఖర్చు ఉంటుందని , అయితే ఈ నిధులను వేటి నుంచి సేకరించాలి, ఎలా ఖర్చు చేయాలి తదతర అంశాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారన్నారు. వీటిని అభివృద్ధి పరిచినట్లయితే విజయవాడ నగర ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉండటంతో పాటు ఆ ప్రాంతాలు టూరిస్ట్ ప్లేస్‌లుగా నిలుస్తాయని ఎఫ్ఆర్ఒ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

పటిష్టంగా ధాన్యం కొనుగోళ్లు : కలెక్టర్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పటిష్టవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కృష్ణాజిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ జన్ను రాఘవరావు అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో ధాన్యం విస్తారంగా పండిందన్నారు. ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడి వచ్చిందన్నారు. రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి అధిక దిగుబడులు సాధించేందుకు కషి చేసిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికార యంత్రాంగానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలు పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు పూర్తి భరోసా ఇస్తూ రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేయాలని జిల్లా రైతాంగం తరపున కోరుతున్నట్లు తెలిపారు. సివిల్ సప్లయ్స్ డిఎం శ్రీధర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ నూతన విధానాలు వివరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి వైస్ చైర్మన్, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4.75 లక్షల గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. గోనె సంచులతో పాటు హమాలీ చార్జీలు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 7 మండలాల పరిధిలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 517 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల మాట్లాడుతూ జిల్లా పరిధిలో 2.35 లక్షల మంది రైతులు 12.5 ఎకరాల్లో వరి సాగుచేశారన్నారు. రైస్ మిల్లర్ల ప్రతినిధి ఎస్.కృష్ణాజి మాట్లాడుతూ జిల్లాలో 9.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మనోహరరావు గత సమావేశంలో తీర్మానించిన సభ్యులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యా నివేదిక సమావేశంలో వివరించారు. కమిటీ సభ్యులు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, పట్టపు శ్రీనివాసరావు, జి.పెరుమాళ్లు, గుళ్లపూడి వేణు, పి.ప్రభాకరరావు, సివిల్ సప్లయ్స్ డిఎం ఏ. శ్రీధర్, జిల్లా పశుసంవర్ధక అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు నివారణకు కృషిచేయాలి : కలెక్టర్

జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషా అధ్యక్షతన గత నాలుగు నెలల వ్యవధిలో (ఆగస్ట్ నుండి నవంబర్ వరకు) జరిగిన మాతృ మరణాలపై వైద్య ఆరోగ్య శాఖతోపాటు వాటి అనుబంధ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీతాబాయి మాట్లాడారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ షర్మిష్ట, డిపిఎం డాక్టర్ సుదర్శన్ బాబు, డి పి హెచ్ ఎన్ ఓ దీవెనమ్మ, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లీల ప్రియదర్శిని, జిల్లా నోడల్ అధికారి శివరంజని, ఐసిడిఎస్ పిఓ ఎస్.సువర్ణ పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో నవశకానికి నాంది : సింహాద్రి

ప్రజాశక్తి-నాగాయలంక

నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

చేయటం ద్వారా రాష్ట్రప్రభుత్వం నవశకానికి నాంది పలికిందని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయలంక మండలం పెద్ద గౌడ పాలెం గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.24.00 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయటానికి రాష్ట్రప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్ బాబు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాక్ అక్రిడేషన్‌పై అవగాహన

మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్శిటీకి నాక్ గుర్తింపు సాధించడమే లక్ష్యంగా అవలంభించాల్సిన మెళకువలు, విధానాలపై అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అవగాహన కల్పించటమే లక్ష్యంగా 'అక్విసిసన్ అండ్ సష్టయిన బిలిటీ ఆఫ్ అకాడమిక్ ఎక్సెన్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ - రోల్ ఆఫ్ నాక్ అక్రిడియేషన్'పై సదస్సు శుక్రవారం ఏర్పాటుచేశారు. పూర్వ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ఉన్నం వెంకయ్య హాజరై మాట్లాడారు. యూనివర్శిటీ వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ కే. బి. చంద్ర శేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రామిరెడ్డి ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలించిన జెసి

మచిలీపట్నం రూరల్ : జాయింట్ కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల శుక్రవారం బందరు మండలం పొట్లపాలెం గ్రామంలో స్వామిత్వ కార్యక్రమం క్రింద జరుగుతున్న రీసర్వే పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ కంఠాలు, స్థలాలు కొలుతలు వేసి సర్వే చేయడం ఎసెస్మెంట్ నెంబర్లు కేటాయించడం స్వామిత్వ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. జిల్లాలో 39 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా స్వామిత్వ చేపట్టి ఇప్పటిదాకా 5 గ్రామాల్లో సర్వే (13 నోటిఫికేషన్) పూర్తయిందన్నారు. పొట్లపాలెం గ్రామంలో 13 నోటిఫికేషన్ పూర్తి అయిందన్నారు. తదుపరి ఆర్వోఆర్ ప్రాసెస్ ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ర్యాండంగా రికార్డు తనిఖీ చేశారు. ప్రాసెస్ ఎలా చేశారని అడిగి తెలుసుకుని ఏవైన ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. డిపిఒ నాగేశ్వర నాయక్, మండల సర్వేయర్ రాజబాబు, సచివాలయ సిబ్బంది జెసి వెంట ఉన్నారు.

కార్తీక అన్న సమారాధన

గుడ్లవల్లేరు : శ్రీ కృష్ణ దేవ రాయల కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీ రామ సహిత సత్యనారాయణ స్వామివారి ప్రాంగణంలో కార్తీక అన్న సమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాధా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షులు వంగవీటి నరేంద్ర, విశిష్ట అతిథిగా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ అలో పుష్పావతి పాల్గొని అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోటప్రోలు బాబురావు, సనక సుబ్రహ్మణ్యం, శీరం నాంచారయ్య, అల్లూరి ఆది నాయుడు, తదితరులు పాల్గొన్నారు .

6న కెఎన్‌పిఎస్ జిల్లా మహాసభ

కోడూరు : కుల నిర్మూలనా పోరాట సమితి (కెఎన్‌పిఎస్) కృష్ణాజిల్లా 4 వ మహాసభలు డిసెంబర్ 6న మచిలీపట్నంలోని చిత్రకళా సంసద్ భవనంలో జరుగుతాయని జిల్లా అధ్యక్షుడు తుమాటి శ్రీరాములు తెలిపారు. శుక్రవారంనాడు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత 10 సంవత్సరాలుగా దళిత, పీడిత కులాల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గన్నవరం

ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని స్రవంతి హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీ కొమ్మినేని రామకృష్ణ అన్నారు. గన్నవరం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల బహుమతి ప్రధానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సైన్స్ పట్ల అభిరుచిని కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి, చెకుముకి కన్వీనర్ షేక్ ఇమామ్ చెకుముకి సైన్స్ సంబరాల ఫలితాలను ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ, గన్నవరం బాలికల ఉన్నత పాఠశాల ద్వితీయ తతీయ స్థానాలు పొందాయని చెప్పారు. ప్రయివేటు పాఠశాల విభాగంలో గన్నవరం స్రవంతి హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు పొందారని తెలిపారు. ఉంగుటూరు మండల విభాగంలో శ్రీ సాయి శ్రీనివాస హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో శ్రీ గణేష్ హైస్కూల్ తతీయ స్థానంలోనూ నిలిచారని చెప్పారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులు డిసెంబర్ 11వ తేదీన విజయవాడ భవానీపురంలోని సైన్స్ సెంటర్ నందు జరిగే జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గన్నవరం ప్రవీణ్ పట్నాయక్ : హేమంత్ కుమార్ - వేణు ద్వితీయ స్థానం, బాలికల ఉన్నత పాఠశాల గన్నవరం పూజిత, బి.లిఖిలా సాయి , బి.నికిత తృతీయ స్థానం బాలికల ఉన్నత పాఠశాల గన్నవరం, మౌనిక : ఫర్జానా: కావ్య, ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం స్రవంతి హై స్కూల్స్ గన్నవరం, విజయ నాగ ప్రకాష్ : గణేష్, శ్రీదేవి ద్వితీయ స్థానం స్రవంతి హై స్కూల్ దుర్గ, అక్షయ, మహమ్మద్ అలీ బాగ్, ఉంగుటూరు మండలం ప్రథమ, ద్వితీయ స్థానాలు శ్రీ సాయి శ్రీనివాస హై స్కూల్, హర్షిత సాయి : పూర్ణిమ, సాయి ప్రశాంత్ ద్వితీయ స్థానం, జాస్మిన్ : హర్షిత, మీను తృతీయ స్థానం శ్రీ గణేష్ హై స్కూల్ పెదవుటపల్లి భాగ్యశ్రీ : లోహిత్, బేబీ నవీన గెలుపొందారు.


పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులు

ఎస్‌ఐకు ప్రజాప్రతినిధుల సత్కారం

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు పోలీస్ స్టేషన్‌కు ఇటీవల సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజేంద్రప్రసాద్‌ను కోడూరు మండలం ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కోడూరు ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు పరిసే మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ ఇంకొల్లు మురళి, వార్డు మెంబర్ వెన్న ప్రసాద్, వైసిపి జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వెంకట నారాయణరావు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, చిలకలపూడి ధర్మయ్య, బురగడ్డ హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పేదల సంక్షేమానికి ప్రాధాన్యత

పామర్రు ఎంఎల్‌ఎ కైలే అనిల్

ప్రజాశక్తి-పమిడిముక్కల

అంబేద్కర్ ఆశయాలతో పేదల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని మంటాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న నాడు-నేడు, రైతుభరోసా, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత, ఆసరా వంటి పథకాలు అన్ని తరగతుల ప్రజలకు ఎంతగానో మేలు చేకూరుస్తున్నాయన్నారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల ఎంపిడిఒ సుధా ప్రవీణ్, ఎంఇఒ శ్రీనివాసులు, మంటాడ గ్రామ సర్పంచ్ నందమూరి వీరమ్మ, గ్రామ కార్యదర్శి సునీత, వైసిపి మండల అధ్యక్షులు యలమంచిలి గణేష్, కొడమంచిలి మహేష్, కంబపు రాంబాబు, కోడిబోయిన కోటేశ్వరరావు, పాతూరి చంద్రపాల్, అజీజ్, బుల్లెట్ రమేష్, కొడాలి రాంబాబు, కనుమూరు వెంకటేశ్వరరావు, యేనుగ మస్తానరావు తదితరులు పాల్గొన్నారు.


మంటాడ గ్రామంలో స్థానికులతో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

గోనె సంచులు సిద్ధం : తహశీల్దార్

ప్రజాశక్తి గుడ్లవల్లేరు

ఈ ఖరీఫ్ లో పడిన పంట ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మండల తాసిల్దార్ అబ్దుల్ రహిమాన్ మస్తాన్ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ అధికారులు, కొనుగోలు సిబ్బంది, మిల్లర్లకు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో దాన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గోని సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈనెలాఖరుకల్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావొచ్చునన్నారు. మండలంలో 23,520 ఎకరాల్లో సాగైన వరి పంట ద్వారా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు మిల్లర్లు పాల్గొన్నారు.

పెడనలో ఉద్రిక్తత

వైసిపి, జనసేనల మధ్య పోస్టర్ వివాదం

పోలీసు స్టేషన్లో జనసేన కార్యకర్తలపై జోగి అనుచరుల దాడి

జనసేన, వైసిపి పోటాపోటీగా ధర్నాలు

రెండు పార్టీల కార్యకర్తలపై కేసులు

ప్రజాశక్తి-పెడన

వైసిపి, జనసేన పార్టీల మధ్య పోస్టర్ల విషయంలో నెలకొన్న వివాదం పెడనలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. పోస్టర్లు అతికించే క్రమంలోనూ, రక్షణ కోరి స్టేషన్‌కు వచ్చిన తర్వాత తమ కార్యకర్తలపై జోగి అనుచరులు దాడి చేశారని ఆరోపిస్తూ జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం పెడన స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ప్రతిగా జోగి అనుచరులు ధర్నాకు పూనుకున్నారు. భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇరుపార్టీల కార్యకర్తలపైన కేసులు నమోదు చేశారు. సేకరించిన వివరాల ప్రకారం జనసేన పార్టీ పెడన నియోజకవర్గ నాయకులు యడ్లపల్లి రామ్‌సుధీర్ మంత్రి జోగిరమేష్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ ఇటీవల పోస్టర్‌ను విడుదల చేశారు. గురువారం రాత్రి పోస్టర్లను అతికించేందుకు కార్యకర్తలను పంపారు. పెడన పట్టణంలోని బంటుమిల్లి రోడ్డులో పోస్టర్‌లు అతికిస్తున్న మద్దాల పవన్, ఖాకీ నాని, సయ్యద్ షాఫీలతో పాటు మరికొంత మంది జనసేన కార్యకర్తలు బంటుమిల్లి రోడ్డులో పోస్టర్లు అతికిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి ఖాజా, మరికొంత మంది వైసిపి కార్యకర్తలతో వచ్చి పోస్టర్లు అతికించే వారిని అడ్డుకున్నారు. జనసేన కార్యకర్తలతో ఘర్షణకు దిగారు. జనసేన కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళి అప్పగించామని వైకాపా కార్యకర్తలు చెపుతున్నారు. తమపై దాడి చేస్తుంటే స్టేషన్‌కు వచ్చిన తమపై పోలీసులు ఎదుటే కార్యకర్తలు దాడులకు దిగారని జనసేన కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. తమపై వైకాపా కార్యకర్తలు దాడులు చేయడానికి నిరసనగా శుక్రవారం పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. జనసేన నాయకులు పోతిన మహేష్, బండి రామకృష్ణ, సందు తదితరులు జనసేన కార్యకర్తల అరెస్టు ఖండించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు స్టేషన్ వద్దకు చేరారు. శాంతి భద్రతల సమస్య ఏర్పడుతుందని పోలీసుల బలగాలు జనసేన కార్యకర్తలను చెదరగొట్టారు. జనసేన నాయకులు రామ్‌సుదీర్‌తోపాటు మద్దాల పవన్, ఖాకీ నాని, సయ్యద్ సఫీతో పాటు, వైసిపికి చెందిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఖాజాతో పాటు ఎండి ఆరీఫ్, శిరివెళ్ళ జయేష్, కొమట్ల అనిల్, కోడూరు శ్రీను, ముత్యాల మురళి, సుబ్బారావు, పెడన ఎస్ఐ కేసు నమోదు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై బెయిల్ మంజూరు చేసి ఇరువర్గాల కార్యకర్తలను విడుదలచేశారు.



ప్రతి విద్యార్థి ఒక సృష్టికర్త కావాలి

జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : విద్యార్థి దశ నుండి యువత కొత్త ఆవిష్కరణలకు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని దీనికి గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు పేర్కొన్నారు. ఈనెల 14వ తేది నుండి 20వ తేది వరకు నిర్వహిస్తున్న 55వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వివిధ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ, క్వీజ్, పోటిలలో విజేతలకు స్థానిక బందర్‌రోడ్డులోని రామమోహన్ గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రాదానోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఇంటర్‌నెట్, ఇ-బుక్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికి గ్రంథాలయాలలో పుస్తక పఠనానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ కార్యదర్శి ఆర్. శారద మాట్లాడుతూ సమాజంలో గ్రంథాలయాల ప్రాధాన్యతను ప్రచారం చేయడానికి గ్రంథాలయ వారోత్సవాలు జరుపుతారన్నారు. ప్రతి విద్యార్థికి గాలి పీల్చడం ఎంత అవసరమో చదువుకోవడం అంత ముఖ్యమన్నారు. ఎవరు బాగా చదువుతారో వారే విజేతలవుతారని విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసం అందించారు. గ్రంథాలయ కమిటీ కార్యదర్శి వి. కెశవరరావు మాట్లాడారు. తొలుత గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు అతిథులకు స్వాగతం పలికారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు విద్యార్థులకు ప్రథమ, ద్వితియ, తృతియ విభాగాలలోని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ ఉపాధ్యక్షులు డి. రామచంద్రరావు, కె. శ్రీకృష్ణ భాగవన్, కమీటి సభ్యులు పి చిదంబేశ్వరావు, సిహెచ్ పద్మ, మాధవరావు, కిరణ్, సాంబశివరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



'ఠాగూర్'లో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 5వ రోజు శుక్రవారం జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా రాష్ట్ర టూరిజం అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రెగన శ్రీనివాసరావు విచ్చేశారు. క్విజ్ పోటీలను ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్విజ్ మాస్టర్లుగా ఎస్ఆర్ఆర్ కళాశాల లైబ్రేరియన్ టి.సాగర్, ఫిజికల్ డైరెక్టర్ బి.యుగంధర్, హిస్టరీ లెక్చరర్ ఉమా తరంగని వ్యవహరించారు. ఠాగూర్ స్మారక గ్రంథాలయ సిబ్బంది ఏ.రామచంద్రుడు, వై.ధన లక్ష్మి, డి.రమేష్, కె.రాంబాబు, జే.శంకర్ పర్యవేక్షించారు.



స్కూల్‌లో టాయిలెట్ కాంప్లెక్స్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : రోటరీ అంతర్జాతీయ సంస్థ రోటరీ ఫౌండేషన్ ద్వారా తాగు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందాని జిల్లా 3020 గవర్నర్ ఏకేఎస్ భాస్కర రామ్ విశ్వనాథమ్ చెప్పారు. విజయవాడ రూరల్ మండలం నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.32.30 లక్షల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక టాయిలెట్ కాంప్లెక్స్ భవనాన్ని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకతో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రామ్ విశ్వనాథం మాట్లాడుతూ, రోటరీ అంతర్జాతీయ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. రోటరీ టాయిలెట్ కాంప్లెక్స్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఏంసీ దాస్ మాట్లాడుతూ, రోటరీ అంతర్జాతీయ సంస్థ రోటరీ ఫౌండేషన్ ద్వారా నున్న జెడ్.పి. హైస్కూలు ఆవరణములో టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మించడం ద్వారా స్త్రీ, శిశు సంక్షేమం, నిరక్ష్యరాస్యత నిర్మూలన అంశములపై కూడా ప్రత్యేకంగా దష్టి సారించినట్లు తెలిపారు. క్లబ్ సభ్యులు పిడిజి డాక్టర్ జివి మోహన్ ప్రాసాద్ పిల్లల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంలో ప్రధాన పాత్ర పోషించిన ప్రముఖ న్యాయవాది, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సభ్యుడు కరిణి చంటిరాజును పలువురు అభినందించారు. విజయవాడ రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు కె సువర్ణరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, నున్న సర్పంచ్ కే సరళ, ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

నీటి ట్యాంకు నిర్మాణం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : మండలంలోని నున్న లో రూ.1.10 కోట్లతో జలజీవన్ మిషన్ కింద మంచినీటి ట్యాంకు నిర్మించనున్నట్లు ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి చెప్పరు. గురువారం నిర్మాణా పనులకు శంఖస్థాపన చేశారు. ఈకార్యక్రమానికి సర్పంచ్ కె. సరళ అధ్యక్షత వహించగా, జెడ్పీటీసీ సువర్ణరాజు, నాగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్వేత, రమణ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులు, రుణాలు

వ్యవహరించారు. ముందుగా సంఘ పతాకాన్ని సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో హరిబాబు ప్రారంభోపన్యాసం చేస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే మూడు నల్ల వ్యవసాయ చట్టాలు తీసుకువచ్చిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో రైతులు 13 నెలలపాటు పోరాడి నల్ల చట్టాలను తిప్పికొట్టారని గుర్తుచేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం గతంలో ఉన్న కౌలు రైతుల చట్టాన్ని రద్దుచేసి ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టం - 2019 తీసుకొచ్చి భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు కార్డులు ఇచ్చే నిబంధన పెట్టిందని విమర్శించారు. దీంతో కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. వ్యవసా యానికి ఇచ్చే సబ్సిడీల్లో కోత పెట్టడంతో కౌలు రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయా యన్నారు. దీంతో వారు అప్పులపాలవు తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయంలో కౌలు రైతులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని, కానీ వారి సంక్షేమానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదని విమర్శించారు. కౌలు రైతులు ఐక్యంగా ఉద్యమించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న చిరుమామిళ్ల హనుమంతరావు

ఉధృతంగా ఉద్యమాలు అవసరం

రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు

రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి పివి.ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ పరిరక్షణకు ఉధృతంగా ఉద్యమాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. కౌలు రైతులంతా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. మహాసభలో సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కుటుంబరావు సౌహార్ద్ర సందేశాలిచ్చారు. ముందుగా కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి నేతలను వేదికపైకి ఆహ్వానించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు గౌస్ ముగింపు పలికారు.

కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులివ్వాలి

మహాసభ తీర్మానం

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆంధ్రప్రదేశ్ పంట హక్కుదారుల చట్టం-2019 రద్దు చేయాలని కోరుతూ మహాసభ తీర్మానించింది. సెల్ఫ్ డిక్లరేషన్‌తో కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని, కౌలు రైతులకు పంట రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించిందింది.

నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జి.సీతారామిరెడ్డి, చనుమోలు సైదులు

అనంతరం మహాసభ సంఘం నూతన కమిటీని ఎన్నుకుంది. అధ్యక్ష కార్యదర్శులుగా గువ్వల సీతారామిరెడ్డి, చనుమోలు సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆఫీస్ బేరర్లుగా చిరుమామిళ్ల హనుమంతరావు, మర్సకట్ల ప్రభాకర్, ఆనందరావు ఎన్నికయ్యారు. 11 మందితో నూతన జిల్లా కమిటీ ఏర్పడింది. ఈ మహాసభకు 10 మండలాల నుండి 105 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

దాళ్వాకు నీరివ్వండి

కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానకు ఈ రెండు మండలాల్లోని సుమారు 4524 మంది రైతులు నష్టపోయారని వినతిపత్రంలో పేర్కొన్నారు. బాధిత రైతులకు ప్రభుత్వం రూ.3.36 కోట్ల మేర నష్టపరిహారం మంజూరు చేసిందని, కానీ ఇంత వరకూ రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను అర్థం చేసుకుని వెంటనే నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో రైతు సంఘం కష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, బంటుమిల్లి మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, నాయకులు పి.నరసింహారావు, ఎస్.మనోహర్ శ్రీ ఉదయ్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.



గంజాయి స్వాధీనం

సోషల్ మీడియాతో చెడే ఎక్కువ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా పడమటలోని కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు 'సోషల్ మీడియా - యువతపై ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ జె ఆంజనేయులు మాట్లాడారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

వారోత్సవ సభలో ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

రాష్ట్రంలో సహకార సంఘాల బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని సహకార శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి స్పష్టం చేశారు.



చిరంజీవిచౌదరిని సత్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

69వ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మచిలీపట్నం లోని కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఈ నెల 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాలలో సహకార శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సీఈఓ శ్యామ్ మనోహర్ బ్యాంకు వ్యాపారాభివృద్ధి తదితర విషయాల పై వివరించారు. అనంతరం బ్యాంకు సిబ్బంది మరియు సహకార సంఘాల అధ్యక్షులతో చర్చించారు. ఈ సంధర్భంగా సంఘాల అధ్యక్షులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ సహకారరంగ బలోపేతం చేయటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గ్రామంలో 25సెంట్ల లో ఒక గిడ్డంగి సహకార సంఘాల ఆధ్వర్యం లో నిర్మిస్తున్నారని ఆ గిడ్డంగులని కొన్ని చోట్ల కళ్యాణ మండపాలుగా, వేర్ హౌస్ గిడ్డంగులగా, మార్కెటింగ్ ప్రోసెస్ యూనిట్లుగా వినియోగించుకుంటున్నారన్నారు. కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని కేడీసీసీ బ్యాంకు జిల్లా లోనే ఉత్తమ బ్యాంకుగా నిలిచిందన్నారు. ఆప్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ఆప్కాబ్, సహకార బ్యాంకులు, సహకార సంఘాలు వేర్వేరు కాదన్నారు. ఐకమత్యంతో కలిసి పనిచేస్తేనే ముందుకు వెళ్లగలమన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ సీఈఓ శ్యామ్ మనోహర్, జీఎం చంద్రశేఖర్, నాబార్డ్ డిడిఎం మిలింద్ మరియు ఆప్కాబ్ ,కేడీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లిలో లక్ష బిల్వార్చన

ప్రజాశక్తి-మోపిదేవి

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన మండల పరిధిలోని పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు విజయ్ కుమార్ శర్మ, బుద్దు వరప్రసాద్ శర్మల బ్రహ్మత్వంలో రుత్వికులు బిల్వార్చన పూజలు నిర్వహించారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల సహాయ కమిషనర్ ఎన్.సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు, రుత్విక్కులు,శాస్త్రోక్తంగా పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అనుమతుల్లేకుండా తరగతులు నిర్వహిస్తే చర్యలు : డిఇఒ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

కృష్ణా జిల్లాలో ప్రయివేటు అన్-ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించి ప్రభుత్వం నుండి గుర్తింపు పొందిన తర్వాతే తరగతులను మాత్రమే నిర్వహించాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని , జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెరా సుల్తానా హెచ్చరించారు. అనుమతి లేకుండా ఏవిధమైన తరగతులు, పాఠశాలలు నడిపినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టిడిపి నిరసన

ప్రజాశక్తి-పెదపారుపూడి

ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో గుడివాడ పట్టణంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆక్వా రైతులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారుల్లో సంఘీభావ ర్యాలీ జరిగింది. రొయ్యకు మద్దతు ధర ప్రకటించి, విద్యుత్ సబ్సిడీలను పునరుద్ధరించాలంటూ గుడివాడ మత్స్య శాఖ కార్యాలయం ముందు ఆక్వా రైతులు నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఆక్వా రైతుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే రావి , ముఖ్యమంత్రికి రాసిన బహిరంగ లేఖను మత్స్య శాఖ అధికారులకు అందజేశారు.



మౌలిక సదుపాయాలకు రూ.9 లక్షలు

గన్నవరం : ఉంగుటూరు మండలం తేలపోలు గ్రామంలోని జగనన్న హౌసింగ్ ఎనిమిది లేఔట్లకు అంతర్గత రహదారులను అభివృద్ధి చేయటానికి, కల్వర్టుల నిర్మాణానికి, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి రూ. 9 లక్షలు మంజూరు చేశామని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ఈ లేఔట్లలో ప్లాట్ పొంది ఇల్లు కట్టుకోని వారికి మౌలిక సదుపాయాలు కలగజేసి వేగవంతంగా సదుపాయాలు కలగజేస్తామన్నారు. లబ్ధిదారులంతా ఈనెలలో లోపు ఇంటి నిర్మాణాన్ని చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ లాం దిబోరా, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవటంలో ప్రభుత్వ విఫలం : బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ, నాగాయలంక

దివిసీమ ఉప్పెన్లో భాగంగా నష్టపోయిన మండలంలోని సొర్లగొంది గ్రామం పూర్తిగా ఇబ్బందుల్లో ఉంటే ఆదుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ విమర్శించారు. దివిసీమ ఉప్పెన దినాన్ని పురస్కరించుకుని బుద్ధప్రసాద్ స్థానిక విలేఖరులతో మాట్లాడారు. 1977లో ఉప్పెన, అది మిగిల్చిన విషయాలను, అనంతరం జరిగిన పునఃనిర్మాణంలో కీలక పాత్ర వహించిన మండలి వెంకట కృష్ణారావు చొరవ గురించి, స్వచ్ఛంద సేవా సంస్థల సేవల గురించి బుద్ధప్రసాద్ గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1977 ఉప్పెన అనంతరం దీవి ప్రాంత పునః నిర్మాణంలో తన తండ్రి విశేష కృషి చేశారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలను ఒక చోట సమీకరించి, దివి ప్రాంతాన్ని శరవేగంగా పునర్మించారన్నారు. ఆయా సంస్థలు నిర్మించిన గృహాలు, తుఫాన్ షెల్టర్లు నేడు శిథిలావస్థకు చేరాయన్నారు. వాటిని పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1977 ఉప్పెనకు ముందు ఏర్పడే ఉత్పాదాలు ముందుగానే అంచనా వేసి, నాటి ప్రభుత్వం చేత మండలి వెంకట కృష్ణారావు సముద్రపు కరకట్టను నిర్మింపచేశారన్నారు. ఆ నాడు సముద్రానికి కట్టా అంటూ కొందరు విమర్శించినప్పటికి వెనకడుగు వేయకుండా నిర్మించారన్నారు. ఉప్పెనలో ఆ కట్ట దెబ్బతినగా, అనంతరం ప్రభుత్వం కరకట్టను పునర్మించిందని, 1990 లో వచ్చిన ఉప్పెన తర్వాత , 2004 తర్వాత రెండు మార్లు కరకట్ట నిర్మాణం చేపట్టామని బుద్ధప్రసాద్ గుర్తుచేశారు. కొత్త తుఫాను షెల్టర్లను నిర్మించడంతో పాటు తీర గ్రామాల్లో మౌళిక సదుపాయాలను కల్పించాలని బుద్ధప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

చల్లపల్లి : గ్రామాల పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా వారికి అరకొర జీతాలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారి పట్ల నిరంకుశ వైఖరి అవలంభిస్తోందని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన జిల్లా అధ్యక్షులు మద్రాపు పోలినాయుడు విమర్శించారు. చల్లపల్లిలోని గుంటూరు బాపనయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో కరోనా ఫ్రంట్ లైన్ వారియర్లుగా సేవలు చేస్తూ మరణించిన పంచాయతీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రూ. 5లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రకటించి ఇప్పటివరకు మరణించిన ఏ ఒక్క కార్మికుని కుటుంబానికి కూడా నయా పైసా సహాయం చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 20న చల్లపల్లిలో జరిగే ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 8వ మహాసభను పంచాయతీ కార్మికులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం మండల కమిటీ నాయకులు చోరగుడి వెంకటేశ్వరరావు, కనగాల ప్రసాద్, సిఐటియు మండల శాఖ అధ్యక్షుడు మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజలకు రక్షణ కల్పించాలి : టిడిపి

కోడూరు : పాలకాయతిప్ప తీరప్రాంత ప్రజలకు రక్షణ కరువైందనీ, ఉప్పునీటికి పంటలు ముంపునకు గురై నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించటంలో కూడా రాష్ట్రప్రభుత్వం విఫలమైందని తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళలు ధ్వజమెత్తారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆదేశాల మేరకు శుక్రవారం కోడూరు మండల పరిధిలోని హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాల్లో కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత ఆధ్వర్యంలో మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా కరకట్ట వెంబడి నివాసముంటున్న ఎస్టీ కుటుంబాల స్థితిగతులను తెలుసుకొని ,శిథిలావస్థకు చేరిన పాలకాయతిప్ప అవుట్ పాల్స్ స్లూయిస్‌ని పరిశీలించారు. చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, అవనిగడ్డ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బండే కనకదుర్గ, జిల్లా అధికార ప్రతినిధులు పాలపర్తి పద్మజ, మల్లంపాటి విజయలక్ష్మి, పాలడుగు వినీల, నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి మోర్ల జయలక్ష్మి, మచిలీపట్నం అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, హంసలదీవి మాజీ సర్పంచ్ కొక్కిలిగడ్డ సముద్రాలు, కోడూరు మండల సోషల్ మీడియా ఐ కన్వీనర్ వేములపల్లి రాజేష్, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-గూడూరు

రాష్ట్రాన్ని సుస్థిరంగా, సుభిక్షంగా ఉంచే శక్తి సిఎం వైఎస్ జగన్‌కు మాత్రమే ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

కార్యక్రమం గూడూరు మండలం చిన ఆకులమన్నాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. ఆయన అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి వివిధ పథకాల ద్వారా అందిన ఆర్థిక సహాయం వివరాలను తెలియజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలు తీరుకు సంబంధించి ప్రతి ఒక్కరినీ కలుస్తున్నామన్నారు. గూడూరు జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, గూడూరు ఎంపిపి సంగా మధుసూదనరావు, ఆకులమన్నాడు ఎంపీటీసీ కోళ్ల లక్ష్మణరావు, మండల పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకట కృష్ణారావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, గూడూరు పిఏసీఎస్ అధ్యక్షులు తలుపుల కష్ణారావు, ఆకులమన్నాడు ఆర్బికే చైర్మన్ బీరం రాజా, పెడన 3వ వార్డు కౌన్సిలర్ బళ్ళా గంగయ్య, గూడూరు తహసీల్దార్ బి విజయ ప్రసాద్, ఎంపీడీవో డి. సుబ్బారావు, ఆకులమన్నాడు పిఏసిఎస్ చైర్మన్ ఫైజుల్ రహమాన్ (మున్నా) , ఎజ్జు వెంకయ్య నాయుడు, గొరిపర్తి రవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐగా ప్రసాదరావు

ప్రజాశక్తి-పెదపారుపూడి

గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐగా ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు. గుడివాడ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఎస్సై ప్రసాదరావు తెలిపారు. గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై ప్రసాదరావు మాట్లాడారు. ప్రతి వాహదారుడు భద్రత కూడిన ప్రయాణంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రధానంగా మైనర్లకు వాహనాలు ఇచ్చి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని ఆయన హితవు పలికారు. రోడ్డు వెంబడి చిరు వ్యాపారాలు చేసుకునే వారు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. అత్యధిక జనాభా కలిగిన గుడివాడ పట్టణంలో ప్రతి వాహనదారుడు సురక్షితంగా ప్రయాణించేందుకు తాను కృషి చేస్తానన్నారు. గుడివాడ పట్టణంపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తాము తీసుకునే చర్యలకు పట్టణ ప్రజలు సహకరించాలని ఎస్ఐ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు.



ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం ఆగదు

ప్రజాశక్తి-గన్నవరం

ప్రభుత్వం దిగొచ్చి నిర్వాశితుల సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని విమానాశ్రయ నిర్వాశితుల పోరాట కమిటీ నాయకులు తిరివీధి ఏసురత్నం తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దావాజీగూడెంలో నిర్వాశితులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరం శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో నిర్వాశితులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం : మేయర్

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ అన్నారు. ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్, కాకరపర్తి భావనారాయణ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాను ప్రారంభించిన మేయర్ రాయన భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తమ శక్తియుక్తులకు పదును పెట్టాలన్నారు. యువతలో ప్రతిభాపాటవాలకు పదును పెట్టేందుకు ప్రభుత్వం స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సాయంతో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పారిశ్రామిక వేత్తలుగా ఎదగటానికి ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి డాక్టర్ పీ నమేష్, ఎంప్లాయిమెంట్ ఎక్జేంజ్ జిల్లా అధికారి డాక్టర్ పీవీ రమేష్‌లు మాట్లాడుతూ యువతలోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు, వారు ప్రతిభావంతంగా ముందుకు సాగేందుకు పలు శిక్షణా కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే క్రమం తప్పకుండా జాబ్‌మేళాలను సైతం నిర్వహిస్తున్నామన్నారు. యువత ఈ విధమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షులు తొమండ్రు శేషయ్య మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు నూటికి నూరుశాతం ఉపాధి అవకాశాలను అందించే దిశగా కషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత తమలోని దాగి ఉన్న తెలివితేటలకు పదును పెట్టాలన్నారు. జీవితానికి లక్ష్యం ఉండాలని, దానిని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. అప్పుడే వారి భవిత ఉత్తమంగా తీర్చిదిద్దబడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలను అందించేందుకు ప్రభుత్వం ఈ విధమైన జాబ్‌మేళాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. సుమారు 864 మంది ఈ జాబ్‌మేళాలో నమోదు చేసుకున్నారన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సుమారు 15 సంస్థలకు చెందిన వివిధ ఖాళీలకు ఇంటార్వ్యూలు నిర్వహించామని, అందులో సుమారు 270 మందిని ఎంపిక చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మీ



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

విజయవాడ: తులసినగర్‌లోని విజయవాడ రవీంద్ర భారతి నెక్ట్స్ జెన్ స్కూల్లో ఈ నెల 17, 18 తేదీల్లో జాబిల్లి తరగతుల పిల్లలకు నిర్వహించిన విచిత్ర వేషధారణ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ వీరమాచినేని వంశీకృష్ణ మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకతను, నైపుణ్యాన్ని, ఆత్మ స్థైర్యాన్ని వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చిన్నారులు స్వతంత్ర సమరయోధులు, జాతీయ నాయకులు, భరతమాత, పౌరాణిక పాత్రలు, కవులు మొదలైన వివిధ వేషధారణలతో, అభినయంతో, డైలాగులతో అలరించారు. అనంతరం పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ వీరమాచినేని శాంతి, జనరల్ మేనేజర్ రాజేష్, జోనల్ ఇంచార్జ్ సరళ, ప్రిన్సిపల్ లావణ్య, అకడమిక్ ఆఫీసర్ నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

లెట్స్ స్కూప్ ఐస్‌క్రీం అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఐస్ క్రీం బ్రాండ్‌లో అగ్రగామిగా ఉన్న లెట్స్ స్కూప్ ఐస్‌క్రీం ఈనెల 20వ తేదీన ప్రారంభించనున్నట్లు లెట్స్ ఫ్రాంచైజీ అనిల్ దేవరపల్లి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. లెట్స్ ఐస్ క్రీం చెఫ్ చక్కటి రుచికరమైన భావన కలిదతిస్తుందన్నారు. రోజు రోజుకూ వినియోగదారులు తమ ఉత్పత్తుల పట్ల ఆదరణ చూపుతున్నారని తెలిపారు. మార్కెట్‌లోకి అంతర్జాతీయ స్థాయి రుచులను తీసుకువస్తున్నామని తెలిపారు. తొలిసారిగా ఈ నెల 20వ తేదీన తెనాలిలో అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్నామని త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. పిస్తా, చాక్లెట్, మామిడి, వనిల్లా, స్ట్రాబెర్రీ, బటర్‌స్కాచ్, రుచుల్లో లభ్యమవుతుందని తెలిపారు.



సిపిఎస్ రద్దుకు కొనసాగిన సంతకాల సేకరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో గవర్నరుపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రెండో రోజు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, శాసన మండలి సభ్యులు షేక్ సాబ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబ్జి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా వెంటనే సిపిఎస్ రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు తప్ప మరేది ఒప్పుకొనేది లేదని అన్నారు. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్లుగా జిపిఎస్ విధానాన్ని అంగీకరించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శిలు జి.విజయలక్ష్మి, ఎ.అనంతకుమార్ పాల్గొన్నారు.

మిక్ కళాశాలకు ఉత్తమ సేవా పురస్కారం



ప్రజాశక్తి-కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు ఆరోగ్య సంరక్షణలో అందిస్తున్న పలు సేవలకు ఉత్తమ సేవ పురస్కారాన్ని అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ పురస్కారాన్ని పుట్టగుంట వెంకట సతీష్ హెల్త్ ఫౌండేషన్ విజయవాడ వారు అందించినట్లు తెలిపారు. మిక్ కళాశాల ఎన్ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా సమాజం కోసం సేవా కార్యక్రమాలు చేపట్టి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచినట్లు చెప్పారు. గడిచిన గత 15 సంవత్సరాలలో దాదాపు పది వేల మంది మిక్ విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. దత్తత గ్రామం పేరకలపాడులో ఎన్నో వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఉత్తమ సేవా పురస్కారాన్ని ఆంధ్రా హాస్పిటల్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామినేని అచ్యుతబాబు గురువారం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిఇఒ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ మెంబర్ ఎం.సుహాస్, డైరెక్టర్ అఫ్ అకాడెమిక్స్ డాక్టర్ టి.వంశీ కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.రాజేష్ పాల్గొన్నారు.

దర్గా నూతన కమిటీపై రాజకీయం తగదు : జనసేన



ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురంలోని గాలిబ్ షాహిద్ దర్గా విషయంలో రాజకీయం తగదని జనసేన పార్టీ నగర అధికార ప్రతినిధి, మైనార్టీ నాయకులు షేక్ గయాజుద్దీన్ (ఐజా) అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన ముజావర్లు దర్గా నూతన కమిటీని ఎన్నుకున్నారన్నారు. అంతకు ముందు పాత కమిటీ మూడేళ్ల సమయం పూర్తయినా కరోనా నేపథ్యంలో కొనసాగించారన్నారు. దర్గా నూతన కమిటీ ఎన్నికపై జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్ పాత కమిటీకి వత్తాసు పలుకుతూ, వెనకేసుకు రావడంలో అర్థమేంటని ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీల దర్గా కమిటీల విషయంలో సంబంధిత అంశాలను ముజావర్లకు వదిలేయడం ఉత్తమమని, వారి సమస్యలను వారే పరిష్కరించుకోవటం జరుగుతోందని అన్నారు. ఇకనైనా ముస్లిం మైనార్టీల కమిటీల విషయంలో రాజకీయ పార్టీలు, నాయకులు జోక్యం చేసుకోకపోవడం మంచిదన్నారు. అదే ప్రాంతంలోని ముస్లీం మైనార్టీల కబరస్తాన్‌ను గత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు ఎవరూ పట్టించుకోలేదని, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి కబరస్తాన్‌కు కొంతమేర ప్రహరీగోడ మాత్రమే కట్టించారని, దాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

విధిగా డ్రైడే పాటించాలి : దుర్గ



దోమల నివారణపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ దుర్గ

ప్రజాశక్తి-విజయవాడ: దోమలు వృద్ధి చెందకుండా, ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. సర్కిల్-3 పరిధిలోని 15వ డివిజన్ రామలింగేశ్వర్‌నగర్, అలాగే సర్కిల్-1 పరిధిలోని 46, 47 డివిజన్లలోని ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ సర్వే నిర్వహించి, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు విధిగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. ఇళ్లలోని నీటి డ్రమ్ములు, కుండీలు, వాటర్ ట్యాంక్ తదితరవాటిని శుభ్రపరుచుకోవాలన్నారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సిఎంఒహెచ్) డాక్టర్ పి రత్నావళి మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిని తీసివేయడం వల్ల కొంతవరకైనా దోమలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చల్లారావు, జోనల్ కమిషనర్లు డాక్టర్ ఎ.రవిచంద్, కెటి సుధాకర్, బయాలజీస్ట్ డాక్టర్ బాబుశ్రీనివాస్, హెల్తాఫీసర్లు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ ఇగ్బాల్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



54వ డివిజన్‌లో వెలంపల్లి పర్యటన

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక 54వ డివిజన్‌లోని 186వ సచివాలయం పరిధిలో 141వ రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని ఆయా ప్రాంతాలలో పర్యటించి గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వ పరంగా జరిగిన సంక్షేమ పథకాల వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 54వ డివిజన్ కార్పొరేటర్ అర్షద్ అయూబ్, శ్రీనన్నదళం అధ్యక్షులు పోతిన వరప్రకాష్ పాల్గొన్నారు.

దుర్గగుడికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి శుక్రవారం యాత్రికులు పోటెత్తారు. ఈ సందర్భంగా యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిత్య ఆర్జిత సేవలైన శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవావరణార్చన, చండీహోమం, శాంతి కళ్యాణం ఇతర సేవల్లో యాత్రికులు పాల్గొన్నారు. దుర్గగుడిలో జరిగే నిత్యాన్నదానం పథకానికి విజయవాడకు చెందిన వి.ఎన్.రాజశేఖర్ రూ.1,00,111 ఆలయ అధికారులను శుక్రవారం కలిసి విరాళంగా అందజేశారు.

